ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
సోమవారం 24 ఫిబ్రవరి 2025

వీడని మంచు దుప్పటి


ఐరాలలో..

వేసవి సమీపిస్తున్నా హిమ తెరలు వీడటం లేదు. ఉదయం ఏడు గంటలవుతున్నా మంచు దుప్పటి తొలగడం లేదు. ఉదయం 8.30 గంటల నుంచి సూర్యుడు ప్రతాపం చాటుకున్నాడు. భిన్న వాతావరణాలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం వాకర్ల అవస్థలు సరేసరి. ఇలాంటి వాతావరణం మండే ఎండలకు సంకేతమని పెద్దలు చెబుతున్నారు. ఐరాల, పెనుమూరు మండలాల్లో ఆదివారం ఉదయం ఇదే తరహా వాతావరణం కనిపించింది.

- ఐరాల/పెనుమూరు, ఆంధ్రజ్యోతి


పెనుమూరులో..

స్వామిత్వ.. ఒక భరోసా

గ్రామీణ ప్రాంత ప్రజల ఆస్తులకు సరైన ధ్రువపత్రాలు లేవన్న కారణంతో వారికి బ్యాంకర్లు రుణాలివ్వడం లేదు. వ్యవసాయ భూముల పాసుపుస్తకాలపై మాత్రమే అన్ని బ్యాంకులూ అప్పులిస్తున్నాయి. ఇల్లు తాకట్టు పెట్టుకుని రుణాలు పొందాలంటే సరైన పత్రాలు లేవని తిరస్కరిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి పల్లెప్రజల ఆస్తుల విలువలను ధ్రువీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం 'స్వామిత్వ' (సర్వే ఆఫ్ విలేజెస్ అబాది అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రావైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ సర్వే పూర్తయితే గ్రామాల్లోని ప్రజలకు తమ ఆస్తులు, భవనాలకు సంబంధించిన వివరాలు పక్కాగా ఉంటాయి. మరోవైపు రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఆదాయమూ వస్తుంది. వీటన్నింటితోపాటు కచ్చితమైన హద్దులు నిర్ణయించడంతో చాలావరకు వివాదాలు, చట్టపరమైన కేసులూ తగ్గుతాయి.

- చిత్తూరు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

- గ్రామీణ ప్రజల ఆస్తులకు ధ్రువపత్రాలు
- బ్యాంకు రుణాలు, రిజిస్ట్రేషన్లకు తొలగనున్న ఇబ్బందులు
- వివాదాలు, చట్టపరమైన కేసులూ తగ్గుతాయి



గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలన్నీ గతంలో చాలావరకు గ్రామకంఠంగా అధికారులు నమోదు చేశారు. దీంతో గృహాలు నిర్మించుకున్నా.. రికార్డుల్లో మాత్రం అదే వివరాలు ఉంచేవారు. దీంతో ఇళ్లు, భవనాలు అమ్ముకోవాలన్నా, కొనుగోలు చేయాలన్నా సమస్యలు ఎదురయ్యేవి. వారసుల పేర్లపై బదలాయింపు చాలాకష్టంగా మారింది. ఇలాంటి వాటికి చెక్ పెట్టాలని కేంద్రప్రభుత్వం స్వామిత్వ మొదలుపెట్టింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ఇందుకు నిధులు సమకూరుస్తోంది. తొలుత రెవెన్యూ, సర్వే యంత్రాంగం ఆయా గ్రామాల సరిహద్దులు గుర్తిస్తుంది. అనంతరం చెరువులను, పాఠశాలలను, రహదారులను, పార్కులను, దేవాలయాలను, అంగన్వాడీ కేంద్రాలను, ప్రభుత్వ కార్యాలయాలను, ఆరోగ్య కేంద్రాలను సర్వేచేస్తారు. తద్వారా ప్రభుత్వ ఆస్తులపై పూర్తి స్పష్టత వస్తుంది. ఆ తర్వాత ప్రజల గృహాలకు హద్దులు నిర్ణయిస్తారు.

జిల్లాలో సర్వే ఇలా..

మండలాలు	: 31
పంచాయతీలు	: 697
గ్రామీణ జనాభా	: 18,76,761
సర్వే పూర్తయిన పంచాయతీలు	: 70
జరుగుతున్న పంచాయతీలు	: 30
జరగాల్సిన పంచాయతీలు	: 597


వి.కోట మండలంలో జరుగుతున్న సర్వే

ఏం చేస్తారంటే...?

సర్వే నిర్వహించే గ్రామంలో డ్రోన్ ద్వారా ప్రతి ఇంటికి సంబంధించిన ఫొటోలు తీస్తారు. ఇది పూర్తయ్యాక పంచాయతీ రాజ్ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి ఇంటి యజమాని పేరు, డోర్ నెంబరు, ఎప్పుడు ఇల్లు నిర్మించుకున్నారు.. వంటి వివరాలు సేకరిస్తారు. సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇల్లు లేదా భవన విస్తీర్ణం ఎంత? ఖాళీ స్థలం ఎంత.. తదితర వివరాలు నమోదు చేసుకుంటారు.

ఆన్‌లైన్‌లోనూ చూసుకోవచ్చు

ఆస్తి ధ్రువపత్రాలు అందజేశాక ఆన్‌లైన్‌లోనూ నమోదు చేస్తారు. కుటుంబ అవసరాలకోసం విక్రయించాలనుకుంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి ఇతరులకు అమ్ముకునే వీలుంటుంది. బ్యాంకుల నుంచి కూడా సులభంగా రుణాలు పొందవచ్చు. ఇప్పటివరకు జిల్లాలోని 70 గ్రామ పంచాయతీల్లో సర్వే పూర్తికాగా, మరో 30 గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది.

గత ప్రభుత్వంలో తప్పిదాలు

వైసీపీ సర్కారు హయాంలోనే స్వామిత్వ కార్యక్రమం ప్రారంభమైంది. కొందరికి ఆస్తి ధ్రువపత్రాలు కూడా పంపిణీ చేశారు. అందులో అనేక తప్పిదాలు దొర్లాయి. యజమాని పేరు, ఫొటో కూడా సరిగ్గా ప్రచురితం కాలేదు. దీంతో భవనాలు, ఇళ్ల యజమానులు అష్టకష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వామిత్వ ప్రాధాన్యాన్ని గుర్తించింది. ఎలాంటి పొరబాట్లు చేయకుండా సక్రమంగా కార్యక్రమాలను చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో గత ఏడాది డిసెంబరు చివరినుంచి పనులు పునఃప్రారంభమయ్యాయి.

శంకర్‌నాయక్ అరెస్టుతో
తిరుపతిలో కలకలం


మాజీ సీఎం జగన్.. వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డితో శంకర్ నాయక్

తిరుపతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విజయవాడ మాచవరంలోని ఓ స్పా సెంటర్‌లో వైసీపీ నేత వడిత్యా శంకర్‌నాయక్ పట్టుబడిన ఘటన తిరుపతిలో కలకలం రేపింది. ఈ శంకర్‌నాయక్ ఎవరు? అతడి నేపథ్యం ఏమిటన్న చర్చ రాష్ట్రవ్యాప్తంగా మొదలైంది. తిరుపతి కేంద్రంగా విద్యార్థి సంఘ ఉద్యమాల్లో అడుగుపెట్టి.. విద్యార్థి నేతగా, ఆపై ప్రజా సంఘ నాయకుడిగా, చివరికి రాజకీయ నేతగా మారిన శంకర్‌నాయక్.. తాజా నిర్వాకంతో ఆయన్ను తెలిసిన వారు విస్తుపోతున్నారు. అనంతపురం జిల్లా ధర్మవరం సమీపంలోని ఓ గిరిజన తాండాకు చెందిన వడిత్యా శంకర్‌నాయక్ డిగ్రీ చదువు కోసం తిరుపతికి వచ్చారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ, ఎస్వీయూలో పీజీ చేశారు. తొలుత ఓ వామపక్ష విద్యార్థి సంఘంలో చేరి చురుగ్గా పనిచేశారు. అతడి వ్యవహార శైలి బాగాలేదని ఆ పార్టీ ముఖ్యనేతలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో బయటికి వచ్చేశారని సమాచారం. తర్వాత గిరిజన విద్యార్థి సమాఖ్య ఏర్పాటు చేసి గిరిజన, ఆదివాసీల హక్కుల పరిరక్షణ పేరిట కార్యక్రమాలు కొనసాగించారు. ఆ సమయంలో టీటీడీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం గిరిజనుల పట్ల వివక్ష చూపుతున్నారంటూ ఏకంగా అట్రాసిటీ కేసు పెట్టారు. ఈ ఘటనతో గిరిజన వర్గాల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. కొంతకాలం తర్వాత ఆ విద్యార్థి సమాఖ్యను గిరిజన ప్రజా సమాఖ్యగా మార్చి.. విజయవాడ, విశాఖపట్నం కేంద్రాలుగా రాజకీయ కార్యకలాపాలకు దిగారు. ఆ క్రమంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ.. గతంలో సీఎంగా ఉన్న చంద్రబాబును లక్ష్యంగా చేసుకొని విమర్శలు, ఆరోపణలు చేసేవారు. అలా వైసీపీ నాయకుల దృష్టిలో పడ్డారు. 2019 ఎన్నికల్లో అనంతపురం జిల్లాలో ఒకరిద్దరు ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం గట్టిగా పనిచేసి వారి ప్రాపకం సంపాదించారు. ఆ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాగా.. అప్పటి సీఎం జగన్ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి సన్నిహితుడయ్యారు. ఆ సాన్నిహిత్యంతో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. గిరిజన విద్యార్థి సమాఖ్య, గిరిజన ప్రజా సమాఖ్యల పేరిట సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో తరచూ జోక్యం చేసుకునే వారని, అధికారులను, సిబ్బందిని వేధించేవారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎస్టీ కమిషన్ సభ్యుడిగా క్యాబినెట్ హోదా కలిగిన పదవిలో మరింత దూకుడుగా వ్యవహరించారన్న విమర్శలు లేకపోలేదు. తాజాగా విజయవాడ మాచవరం ప్రాంతంలో ఓ స్పా సెంటర్లో వ్యభిచారం నడుస్తోందని వచ్చిన ఫిర్యాదులతో పోలీసులు దాడి చేయగా అక్కడ శంకర్‌నాయక్ పట్టుబడ్డారు. ఓ గదిలోని మంచం కింద దాక్కుని ఉన్న ఫొటోలు, వీడియోలు బయటికి రావడంతో తిరుపతిలో విద్యార్థి ప్రజా సంఘాలు విస్తుపోతున్నాయి. ఎస్టీ కమిషన్ మెంబరుగా ఇటీవలే ఆయన పదవీకాలం ముగిసింది. కాగా, తిరుపతికి వచ్చిన ప్రారంభంలో పేదరిక నేపథ్యంలో ఉన్న ఆయన.. ఇప్పుడు ఆర్థికంగా మంచి స్థాయికి చేరారని అతడి సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

అంతంతమాత్రంగా టమోటా ధరలు

- 10 కిలోల బాక్సు రూ.140లోపే
- ఆందోళనలో రైతులు

పలమనేరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్‌లో టమోటా ధరలు అంతంతమాత్రంగా పలుకుతున్నాయి. టమోటా బాక్స్ ధర (10 కిలోలు) రూ.120 నుంచి రూ.140లోపే ఉంటోంది. నాలుగైదు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. మార్కెట్‌కు పెద్ద ఎత్తున టమోటాలు రాకపోయినప్పటికీ ధరలు మాత్రం పెరగక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగు ధరలు పెరిగిపోవడంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఒకప్పుడు బాక్సు రూ.200 ధర పలికినా పెట్టుబడి అయినా చేతికి వచ్చిందని తృప్తి పడేవారు. ప్రస్తుతం బాక్సు ధర రూ.350-400 వరకు పలికినా పెట్టుబడులు చేతికందని పరిస్థితి నెలకొంది.

మళ్లీ మొదలైన గజదాడులు

- పులిచెర్ల మండలంలోకి ప్రవేశించిన 12 ఏనుగుల గుంపు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న అటవీ అధికారులు

కల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల విరామం తర్వాత పులిచెర్ల మండలంలో ఏనుగుల దాడులు మళ్లీ మొదలయ్యాయి. 2024 సంవత్సరం సెప్టెంబరులో మండలంలోకి ప్రవేశించిన 16 ఏనుగుల గుంపు మూడు నెలల పాటు ఇక్కడే తిష్ఠవేసి పంటలకు అపారనష్టం కలిగించాయి. గత ఏడాది నవంబరు 22న పులిచెర్ల సరిహద్దులోని చిన్నగొట్టిగల్లు మండలం దేవపట్లవారిపల్లె సమీపంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగల ఉచ్చులో ఏనుగు మృతి చెందాక తలకోన అడవివైపు గజరాజుల గుంపు వెళ్లిపోయింది. సరిగ్గా మూడు నెలల తర్వాత శనివారం రాత్రి సుమారు 12 ఏనుగుల గుంపు మండలంలోకి ప్రవేశించాయి. ముందుగా మంగళంపేట అడవి నుంచి ఎల్లంకివారిపల్లె పంచాయతీ దిగుమూర్తివారిపల్లె సమీపానికి చేరుకున్నాయి. అక్కడినుంచి తిరుపతికి వెళ్లే రోడ్డులోని గోపాలపురం మీదుగా రోడ్డుకు సమీపంలోని యల్లంపల్లెలోని రైతు సతీష్‌కు చెందిన అరటి, మామిడిచెట్లను పాక్షికంగా విరిచేశాయి. భీమవరం అటవీమార్గంలో వెళుతూ రోడ్డుకు ఇరువైపులా ఉండే కలబందను తొక్కేశాయి. మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మామిడితోటకు అమర్చిన రాతి కూసాలను ధ్వంసం చేశాయి. అనంతరం అడవిలోకి చేరుకొని ఘీంకారం చేస్తున్నట్లు స్థానిక ప్రజలు తెలిపారు.

కళ్యాణి డ్యాంనుంచి వచ్చాయన్న ఎఫ్ఎస్వో

ఎఫ్ఎస్వో మహమ్మద్ షఫీ, ఎఫ్బీవో కృష్ణమూర్తి తమ సిబ్బందితో కలిసి ఆదివారం ఏనుగులు సంచరించిన ప్రాంతానికి చేరుకున్నారు. గత ఏడాది మండలంలో పంటలను ధ్వంసం చేసిన 16 ఏనుగుల గుంపు తలకోన అడవిలో ఉన్నాయని చెప్పారు. కళ్యాణి డ్యాం వద్ద ఉన్న మరో 12 ఏనుగుల గుంపు ప్రస్తుతం పులిచెర్ల మండలంలోకి ప్రవేశించాయన్నారు. ఈ గుంపులో పిల్ల ఏనుగులు ఎక్కువగా ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.



గోపాలపురంలో ఏనుగుల పాదముద్రలు - రామ్మూర్తి నాయుడు తోటలో విరిచేసిన మామిడి చెట్లు

రంకేసిన కోడెగిత్తలు


కోడెగిత్తలను నిలువరిస్తున్న యువకులు
పట్టీల కోసం పోటీపడుతున్న యువకులు

- కన్నికాపురంలో ఘనంగా జల్లికట్టు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం కన్నికాపురంలో ఆదివారం జల్లికట్టు ఘనంగా జరిగింది. జల్లికట్టు జరగనున్నట్లు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పించడంతో వివిధ ప్రాంతాల నుంచి కోడెగిత్తలను తీసుకొచ్చారు. జనం కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొమ్ములకు పట్టీలను కట్టి అల్లిలోకి కోడెగిత్తలను వదిలారు. కొందరు యువకులు వాటిని నిలువరించడానికి, పట్టీలను దక్కించుకోవడానికి పోటీపడ్డారు. ఈ సందర్భంగా కొందరు యువకులకు స్వల్పగాయాలయ్యాయి. ఓ ఇంటి మెట్లపైనుంచి ఈ వేడుకను చూస్తున్న ఓ మహిళ కింద పడటంతో గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు.

నేడు 'పీజీఆర్ఎస్'

చితూరు అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఆయా మండల, నియోజకవర్గాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు.

వరసిద్ధుడి దర్శనానికి 4 గంటలు

స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచే స్వామి దర్శనార్థం అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో క్యూలైన్లు ఆలయం వెలుపలకు వ్యాపించాయి. స్వామి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించారు.

- ఐరాల(కాణిపాకం), ఆంధ్రజ్యోతి


క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

మహానందీశ్వరుడికి వరసిద్ధుడి పట్టు వస్త్రాలు



అధికారులకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఈవో పెంచలకిషోర్ దంపతులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నందీశ్వరుడికి కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరపున ఈవో పెంచలకిషోర్ దంపతులు ఆదివారం పట్టు వస్త్రాలను సమర్పించారు. వీరిని మహానంది ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహానంది ఆలయ ఏఈవో మధు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, వరసిద్ధుడి ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.4.50 లక్షల విరాళం: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి ఆదివారం రూ.4,50,232 విరాళం లభించింది. నెల్లూరుకు చెందిన జి.శ్రీనివాసులురెడ్డి అన్నదాన సత్రానికి రూ.2,50,232, గోసంరక్షణ ట్రస్టు నిర్వహణకు రూ.2లక్షలు విరాళంగా అందించినట్లు ఏఈవో రవీంద్రబాబు తెలిపారు. దాతను ఏఈవో ఆలయ మర్యాదలతో స్వాగతించారు. దర్శనానంతరం దాతను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

జాతిని జాగృతం చేసేవి రచనలు

- అభ్యుదయ రచయిత తుల శ్రీనివాస్



గంటా కమలమ్మ పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రచయితలు మారుతున్న సామాజిక ఆర్థిక, రాజకీయ, సాంఘిక అంశాలతో జాతిని చైతన్యం పరిచేలా రచనలు కొనసాగించాలని అభ్యుదయ రచయిత తుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక విజయం విద్యాసంస్థల్లో 2024వ సంవత్సరపు గంటా కమలమ్మ సాహిత్య పురస్కార సభ జరిగింది. కుప్పం రెడ్డెమ్మ సాహితీ సంస్థ అధ్యక్షురాలు డాక్టరు కె.రామలక్ష్మి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన సాహితీ విమర్శకుడు రాధేయ మాట్లాడుతూ సాహితీవేత్తలను ప్రభుత్వాలు తగినరీతిలో గుర్తించాలన్నారు. గంటా కమలమ్మ పురస్కార గ్రహీత లండా సాంబమూర్తి మాట్లాడుతూ.. ప్రాంతాలు, వ్యవస్థలు, చట్టాలు సాహితీ రంగం ద్వారానే ప్రజలకు చేరతాయన్నారు. గంటా పురస్కారానికి ఎంపికైన చింతలతొవ్వ రచయిత శ్రీనివాస్, నాలుగు రెక్కల పిట్ట రచయిత సాంబమూర్తిలకు రూ.10వేలు అందజేసి సత్కరించారు. గంటా కమలమ్మ పురస్కారం వ్యవస్థాపకుడు గంటా మోహన్, ఆయన కుటుంబ సభ్యులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పలమనేరు బాలాజి, యువశ్రీ, సాకం నాగరాజు, గిరిధరన్, పల్లిపట్లు నాగరాజు, వి.హరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు



సమావేశంలో ప్రసంగిస్తున్న డీవీఈవో సయ్యద్ మౌల

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి ఒకటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీవీఈవో సయ్యద్‌మౌల సూచించారు. స్థానికంగా ఓ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్, సిట్టింగ్, ఫ్లైయింగ్ అధికారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. పరీక్షల కోసం 50 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల ప్రత్యేక అధికారి దయానందరాజు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో డెస్కులు, తాగునీరు, మెడికల్ స్టాఫ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యుడు బాలసుబ్రహ్మణ్యం, డీఈసీబీ సభ్యుడు శరశ్చంద్రశేఖర్, హేమలత, నిర్మలకుమారి, రియాజ్, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

హాల్ టికెట్లు వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు: హాల్ టికెట్లు వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునేందుకు 95523 00009 నంబరును అందుబాటులో ఉంచారు. విద్యార్థులు మొబైల్ నుంచి ఈ నంబరుకు హాయ్ పెడితే ప్రభుత్వ సర్వీసులు డిస్‌ప్లే అవుతాయి. అందులో ఆధార్, రోల్ నంబరు, పుట్టిన తేదీ టైప్ చేస్తే హాల్ టికెట్ పీడీఎఫ్ ఫార్మేట్‌లో వస్తుంది.

జిల్లాకు చేరిన ఓపెన్ స్కూల్ ఇంటర్ ప్రశ్నపత్రాలు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 15 కేంద్రాల్లో మార్చి 3 నుంచి నిర్వహించే ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలు జిల్లాకు చేరాయి. డీఆర్వో మోహన్ కుమార్ ఆధ్వర్యంలో డీఈవో వరలక్ష్మి, ఏడీ వెంకటేశ్వరరావు సమక్షంలో ప్రశ్నపత్రాలను తొలుత స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. అక్కడి నుంచి నాలుగు రూట్లలో కట్టుదిట్టమైన భద్రత మధ్య 15 పోలీసుస్టేషన్లకు తరలించారు.

సామాజిక ఇతివృత్తాలే రచనలకు మూలం



పలమనేరు బాలాజీని సత్కరిస్తున్న రచయితలు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నిత్యం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ఎదుర్కొంటున్న సామాజిక అంశాలే రచనలకు మూలమని డీఆర్వో మోహన్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక విజయం విద్యాసంస్థల్లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో చంద్రశేఖర్ రచించిన అందమైన జీవితం పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ తన తల్లిదండ్రులు, అత్తమామల స్మారకార్థం 2022 సంవత్సరానికి సాహితీ పురస్కారాన్ని పలమనేరు బాలాజీకి, నవలా రచయిత్రి పెళ్లకూరు జయప్రదరెడ్డికి, 2023 సంవత్సర పురస్కారాలను రచయితలు రాచపూటి రమేష్, డి.కె.చదువుల బాబుకు, గతేడాది పురస్కారాలను టి.శాంతభాస్కర్, బలుసు వెంకట కామేశ్వరరావుకు అందజేశారు. రూ.3వేలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కుప్పం రెడ్డెమ్మ సాహితీ సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె.రామలక్ష్మి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గిరిధరన్, హరివిల్లు లలిత కళావేదిక గౌరవాధ్యక్షుడు హరినాయుడు, పార్థసారథినాయుడు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

మొగిలీశ్వరుడి బ్రహ్మోత్సవాలకు

వైభవంగా అంకురార్పణ

- మూషిక వాహనంపై వినాయకుడి విహారం



పూజలు చేస్తున్న అర్చకుడు



మూషిక వాహనంపై వినాయకుడు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని మొగిలిలో ఉన్న స్వయంభు కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం అంకురార్పణ వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకుడు గంగాధర గురుకుల్ ఆధ్వర్యంలో ఉదయం అర్చకులు స్వామి, అమ్మవార్లను అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు. ఉత్సవాలు విజయవంతం కావాలని రాత్రి వినాయకుడిని మూషిక వాహనంపై అధిష్ఠింపజేసి, గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా బంగారుపాళ్యంకు చెందిన సరస్వతి, సుధాకర్‌నాయుడు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్, ఈవో మునిరాజ, అర్చకులు హరికేష్ గురుకుల్, మంజునాథ గురుకుల్, సోము గురుకుల్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

సోమవారం ఉదయం తొమ్మిది నుంచి 10 గంటల మధ్య మొగిలీశ్వరుడికి అభిషేకం, కలస్థాపన, ధ్వజారోహణం కార్యక్రమం జరగనుంది. రాత్రికి అభిషేకం అయ్యాక హంసవాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఉంటుంది.

26న మొగిలికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మొగిలికి ఈ నెల 26వ తేదీన ఆర్టీసీ 1-డిపో నుంచి ఆరు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు.

రేణిగుంటకు సీఎం చంద్రబాబు

- నరసింహ యాదవ్ తనయుడి వివాహానికి హాజరు



వధూవరులను ఆశీర్వదించాక, నరసింహయాదవ్ కుటుంబ సభ్యులతో సీఎం

తిరుపతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదివారం రేణిగుంటకు వచ్చారు. తూకివాకం సమీపంలోని ఆర్వీఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్, తిరుపతి పార్లమెంటరీ టీడీపీ కమిటీ అధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ కుమారుడి వివాహానికి హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో వచ్చిన ఆయన.. వధూవరులు సుదర్శన్ యాదవ్, పూజలను ఆశీర్వదించారు. వధూవరుల తల్లిదండ్రులు, బంధుమిత్రులతో కలసి గ్రూపు ఫొటోలు దిగారు. సుమారు అరగంట పాటు ఆయన పెళ్లి మండపంలో గడిపారు. అనంతరం విమానాశ్రయం చేరుకుని హెలికాప్టర్‌లో నెల్లూరు జిల్లా పర్యటనకు వెళ్లారు. కాగా, ఉదయం ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న సీఎంకు పలమనేరు, చంద్రగిరి, నగరి, జీడీనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, డాక్టర్ థామస్, గురజాల జగన్మోహన్, మురళీమోహన్, అనంతపురం డీఐజీ షిమోషి బాజ్‌పాయ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సాల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు ఘనస్వాగతం పలికారు.

అధినేత రాకతో..

టీడీపీ ఆవిర్భావం నుంచీ కొనసాగుతున్న నరసింహ యాదవ్.. తన కుమారుడి వివాహానికి అధినేత చంద్రబాబు హాజరు కావడంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. తొలినుంచీ ఆయనకు సిన్సియర్ నాయకుడిగా గుర్తింపు ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో తుడా చైర్మన్‌గా నియమించారు. ఎన్నికలకు ముందు నుంచీ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఆయన ప్రస్తుతం ఎమ్మెల్సీ లేదా టీటీడీ చైర్మన్ పదవిని ఆశించారు. ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వగా.. ఆయన సంతోషంగా లేరు. తాను మరో రెండేళ్లయినా వేచి చూస్తానని, తనకు సముచిత పదవి ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరారు. ఆ మేరకు ఇప్పటికీ యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టలేదు. తాజాగా ఆదివారం అధినేత చంద్రబాబు కేవలం నరసింహ యాదవ్ తనయుడి వివాహానికే ప్రత్యేకంగా రావడం.. అరగంట పాటు వారితో గడపారు. ఇలా.. అధినేత తనకిచ్చిన ప్రాధాన్యతకు నరసింహ యాదవ్, ఆయన కుటుంబీకులకు సంతోషం కలిగించింది.

'జీబీఎస్'పై భయపడొద్దు

సాధారణ చికిత్సతో నయమవుతుంది

పైగా లక్షమందిలో ఒకరిద్దరికే ఈ వ్యాధి వస్తుందంటున్న వైద్యులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) అనే నరాల సంబంధిత వ్యాధి కేసులు ఇటీవల ఒక్కసారిగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు కేసులు నమోదు కాకున్నా.. ప్రజల్లో ఆందోళన మాత్రం ఉంది. ఇది అంటువ్యాధి కాకపోయినా.. అప్రమత్తంగా ఉండాల్సిందేనని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రాణాంతకం కాదు కానీ..

ఈ వ్యాధి ప్రాణాంతకం కాకపోయినా.. సకాలంలో గుర్తించి చికిత్స పొందకపోతే ప్రమాదం సంభవిస్తుంది. ఇన్‌ఫెక్షన్లు వచ్చినా, కలుషిత నీరు, ఆహారం తీసుకున్నా, పెద్ద ఆపరేషన్లు చేయించుకున్నా ఈ వ్యాధి సోకే అవకాశాలున్నాయి. దీన్ని ముందుగా నిరోధించలేం. కాళ్లు, చేతుల్లో బలహీనత కనిపిస్తే.. కొద్దివారాల ముందు విరేచనాలు, కడుపునొప్పి ఉన్నాయా అనేది చూడాలి. జీబీఎస్ లక్షణాలున్నాయని అనుమానిస్తే వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి. నర్వ్ కండక్షన్, ఎలక్ట్రోమయోగ్రఫీ, సీఎస్ఎఫ్, ఎంఆర్ఐ వంటి పరీక్షల ద్వారా ఈ వ్యాధిని వైద్యులు నిర్ధారిస్తారు.

వ్యాధి లక్షణాలు..

- వేళ్లు, మడమలు, మణికట్టు వంటి చోట్ల సూదులతో పొడుస్తున్నట్లు అనిపించడం.
- కాళ్లలో మొదలైన బలహీనత పైకి విస్తరించడం, కాళ్లనొప్పులు.
- కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు, మంటగా అనిపించడం.
- సరిగా నడవలేక పోవడం, తూలడం, మెట్లు ఎక్కలేకపోవడం.
- నోరు వంకరపోవడం, మాట్లాడడంలో, నమలడంలో, మింగడంలో ఇబ్బంది.
- మెడ నిలబడక పోవడం, ముఖ కండరాల్లో కదలిక లేకపోవడం.
- ఒకటికి రెండు దృశ్యాలు కనిపించడం, కళ్లు కదిలించలేకపోవడం, పూర్తిగా మూయలేకపోవడం.
- వ్యాధి తీవ్రమైతే శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బంది వస్తుంది.
- కొందరిలో గుండె వేగంగా, అస్తవ్యస్తమవడం, రక్తపోటులో హెచ్చుతగ్గులు సంభవిస్తాయి.
- కొందరిలో అరుదుగా విపరీతంగా చెమటలు పడతాయి.

నివారణ చర్యలు ఇవీ..

కాచి వడబోసిన నీళ్లను తాగాలి. కూరగాయాలు, పండ్లు ఒకటికి రెండుసార్లు శుభ్రంగా కడిగాకే వాడుకోవాలి. మాంసం వంటి పదార్థాల్ని 75 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద పూర్తిగా ఉడికేలా వండుకోవాలి. పచ్చిగుడ్లు తినకూడదు. చేపలు, రొయ్యలు, పీతలనూ పూర్తిగా ఉడికించి తినాలి. వంట చేసేటప్పుడు, భోజనం చేసేముందు మలవిసర్జన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. మాంస పదార్థాల్ని వేడినీటితో బాగా కడిగిన తర్వాతే వండుకోవాలి.

సాధారణ చికిత్సతో నయమవుతుంది



జీబీఎస్ వ్యాధి ప్రాణాంతకం కాదు. సాధారణ చికిత్సతో నయమవుతుంది. ఏదో ఒకటి, రెండు కేసుల్లో మాత్రమే ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించాల్సి ఉంటుంది. ఇందుకు ప్రత్యేక మందులంటూ ఏమీ లేవు. సపోర్టింగ్ ట్రీట్‌మెంట్ సరిపోతుంది. అవసరమైన మందులు, మాత్రలు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు.

- డాక్టర్ అరుణ్‌కుమార్, చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్

మందులన్నీ అందుబాటులో ఉన్నాయి



జిల్లాలో ఇంకా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ప్రజలందరూ ధైర్యంగా ఉండాలి. లక్ష మందిలో ఒకరిద్దరికే ఈ వ్యాధి వస్తుంది. జిల్లాలోని అన్ని ఏరియా, సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- ప్రభావతి, డీసీహెచ్ఎస్

సంపద కేంద్రాల పునరుద్ధరణకు నిధుల విడుదల

- డీపీవో సుధాకర్‌రావు



చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరమ్మతులకు గురైన 'చెత్త నుంచి సంపద తయారీ' కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకోసం ప్రభుత్వం రూ.1.65 కోట్లు విడుదల చేసిందని డీపీవో కె.సుధాకర్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్లలో గ్రామపంచాయతీల్లో నిధుల కొరత ఏర్పడి పలు కేంద్రాల్లో క్లాప్‌మిత్రలు లేక, ఉన్నవారికి సరైన వేతనాలు చెల్లించక పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందన్నారు. తాను డీపీవోగా బాధ్యతలు స్వీకరించాక ఈ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడతలవారీగా విడుదల చేస్తున్న నిధుల నుంచి క్లాప్‌మిత్రలకు వేతన బకాయిలను చెల్లించామన్నారు. పంచాయతీలకే క్లాప్‌మిత్ర పోస్టుల భర్తీచేసుకునే అవకాశాన్ని కల్పించామని చెప్పారు. ఇంటింటి నుంచి రోజూ చెత్త సేకరించి, సంపద కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. తడిచెత్త నుంచి వర్మి కంపోస్టును ఉత్పత్తిచేసి, తక్కువ ధరకే రైతులకు విక్రయిస్తున్నట్లు తెలియజేశారు.

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి



మణి (ఫైల్ ఫొటో)

వి.కోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పంటకు నీరందించేందుకు వెళ్లిన రైతు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన వి.కోట మండలంలో ఆదివారం జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. యాలకల్లు పంచాయతీ వైసీబండపల్లెకు చెందిన మణి (42) పంటకు నీరందించేందుకు శనివారం రాత్రి వెళ్లాడు. ఆదివారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో భార్యకు అనుమానం వచ్చి పొలం వద్దకు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గ్రామస్థుల సాయంతో ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మణి మృతిపై కుటుంబీకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూత వాహనంపై జగద్రక్షకుడు



ఉదయం.. పురవీధుల ఉత్సవానికి బయలుదేరుతున్న స్వామి అమ్మవార్లు - భూతవాహనంపై శివయ్య, చిలుక వాహనంపై అమ్మవార్ల పురవిహారం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి జగద్రక్షకుడైన పరమశివుడు భూతవాహనంపై.. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చిలుక వాహనంపై ఊరేగారు. మూషికవాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప అనుసరించారు. రాజగోపురం గుండా తేరువీధిలోకి ప్రవేశించి.. ఆ తర్వాత నెహ్రూవీధి, నగరివీధి, బజారువీధిగుండా స్వామి అమ్మవార్ల ఊరేగింపు సాగింది. ఉదయం.. సూర్యప్రభ వాహనంపై పరమ శివుడు, చప్పరంపై అమ్మవారు ఊరేగారు. వీరిని మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప అనుసరించారు. పురవీధుల్లో ఊరేగుతున్న పార్వతి, పరమేశ్వరులను భక్తులు దర్శించుకుని కర్పూర హారతులు సమర్పించారు. కోలాటాలు కనువిందుచేశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 9గంటలకు: హంస - యాళి వాహనసేవ

రాత్రి 8 గంటలకు: రావణుడు - నెమలి వాహనసేవ

ఐఐటీలో ముగిసిన తిరుత్సవ్ 2కే25

- సృజనాత్మకత, సాంకేతిక మేళవింపుతో విద్యార్థుల సందడి
- జోష్ నింపిన మూడ్రోజుల టెక్నో కల్చరల్ ఫెస్ట్



సంగీత విభావరిలో తిలకిస్తున్న విద్యార్థులు

ఏర్పేడు/తిరుపతి రూరల్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): ఏర్పేడులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) వేదికగా మూడు రోజులుగా తిరుత్సవ్-2కే25 పేరిట నిర్వహించిన టెక్నో అండ్ కల్చరల్ ఫెస్ట్ ఆదివారంతో ముగిసింది. దీనిలో భాగంగా మూడు రోజులపాటు పలువురు విద్యార్థులు తమలో అంతర్లీనమైన ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించి అద్భుత ప్రదర్శనలు చేశారు సృజనాత్మకత, సాంకేతిక సాంస్కృతికల మేళవింపుగా సాగిన తిరుత్సవ్ విద్యార్థుల్లో జోష్ నింపింది. చివరి రోజు ఆదివారం పలు అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ట్రెజర్ హంట్ అడ్వెంచర్ పోటీలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని లక్ష్యాన్ని చేరుకున్న విధానం ఆకట్టుకుంది. విద్యార్థుల్లో భాషణంపై స్పష్టతను పరీక్షించేలా సాగిన పాప్ కల్చర్ క్విజ్ పోటీలు ఆలోచింప చేశాయి. క్రికెట్ ఓ మానియా పాల్గొన్న విద్యార్థుల నుంచి మాక్ ఐపీఎల్ వేలం పాట నిర్వహించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దొంగను పట్టుకునే విధానంపై ఎస్కేప్ రూమ్, టెక్ హీస్ట్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇక టెక్నికల్ సదస్సులో అధ్యాపకుల మార్గదర్శకంలో నూతన ఆవిష్కరణల రూపకల్పన దిశగా నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన సంగీత విభావరి: సినీ నేపథ్య గాయకుడు హరిచరణ్, గాయని శిరీష, ఆకాశ్ బృంద నేతృత్వంలో నిర్వహించిన సంగీత విభావరి ఉర్రూతలూగించింది. సినీ గీతాలకు విద్యార్థులు అడుగులు కదుపుతూ డాన్సులు చేసి సందడి చేశారు. కేరింతలు చప్పట్లతో సంగీత విభావరి హోరెత్తింది.



తరగతి గదిలో విద్యార్థులు

చురుగ్గా పూడికతీత పనులు



ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట శుభ్రమైన మురుగు కాలువ

కుప్పం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘంలో మురుగు కాలువలు కొంత కాలంగా శుభ్రమవుతున్నాయి. ఏళ్లుగా పేరుకుపోయిన పూడిక తీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో చిన్నపాటి వర్షమొచ్చినా మురుగు కాలువలు ఎక్కడికక్కడ పొంగి రోడ్లపై ప్రవహించేవి. దీంతో దుర్గంధం వ్యాపించడంతోపాటు వాహనదారులు, పాదచారులకు రాకపోకలు కష్టసాధ్యంగా మారేవి. అయితే మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వారం రోజులుగా కుప్పంలోని ప్రధాన కాలువలతోపాటు సందుల్లోని కాలువల్లోనూ పూడిక తీత పనులు జోరుగా సాగుతున్నాయి. దీంతో కాలువలు శుభ్రపడి ప్రజలు దుర్గంధంతోపాటు ఎక్కడికక్కడ మురుగు ఆగిపోయే దుస్థితి నుంచి బయట పడుతున్నారు. పనులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కొడిస్తంభం ప్రతిష్ఠ



కొడి స్తంభానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

కల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం వైభవోపేతంగా కొడి స్తంభం ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ముందుగా స్వామివారికి అభిషేకాలు, హోమాలు చేపట్టారు. రూ. 2 లక్షలు విలువైన కొడి స్తంభాన్ని కోటపల్లికి చెందిన దశరధనాయుడు దంపతులు వితరణగా అందించడంతో వారిని ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకులు మురళీధర్, కుమార్‌రెడ్డి, ధనంజయనాయుడు, కరుణాకర్‌నాయుడు, నారాయణస్వామినాయుడు, మోహన్‌దాస్, యర్రయ్య, వెంకటమునినాయుడు, మురళి, చంద్రారెడ్డి, రాజేష్, మునేంద్ర, సునీల్, అర్చకులు అనంతకుమారాచార్యులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

సోమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని సోమల ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడంతో అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని అవగాహన కల్పించారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా సేవా కేంద్రం ప్రారంభం



సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విశ్రాంత డీఎస్పీ సుకుమార్

పుంగనూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అందుబాటులో బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలు అందిస్తున్నట్లు విశ్రాంత డీఎస్పీ సుకుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎంబీటీ రోడ్డులో సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాదారులు సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 నుంచి 70 ఏళ్ల లోపు వయస్సు కలిగిన ఖాతాదారులు పీఎంఎస్బీవైకి ఏడాదికి రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షలు, అలాగే పీఎంజేజేబీవైకి 50 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు రూ.432 చెల్లిస్తే రూ.2 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాడాల సుబ్రహ్మణ్యం, మాజీ సైనికులు నాగరాజనాయక్, వేణుగోపాల్, రాజారెడ్డి, హనుమంతప్ప, ఎస్వీ బాబు, సుధాకర్‌రెడ్డి, హరిమొదలియార్, నాగరాజరెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యమనేత మృతికి నివాళులు



సురేష్ మృతదేహానికి పూలమాలలు వేస్తున్న రాష్ట్ర బీసీ నేత కృష్ణమూర్తి

పుంగనూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో బీసీ ఉద్యమనేత సురేష్ మృతి బీసీలకు తీరనిలోటని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ నేత కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం బీసీ ఉద్యమనేత మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమానికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు.

బాధితుడికి నిత్యావసర సరుకుల పంపిణీ



బాధితుడికి నిత్యావసర సరకులు అందిస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేతిగుట్లపల్లె పంచాయతీ ఆరట్లపల్లెకు చెందిన పెద్ద బుడ్డన్న పూరిల్లు శనివారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురైంది. ప్రమాదంలో దాదాపు 15 బస్తాల వడ్లు, భూముల రికార్డులు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డులు పూర్తిగా కాలిపోయినట్లు అధికారులు తెలిపారు. టీడీపీ నాయకులు కోలాట రమణ, పులి వెంకటరమణ, వీఆర్వో భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేశ్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడికి సరకులు, నగదు అందించారు.

బోయకొండ గంగమ్మకు
పంచామృతాభిషేకాలు



చౌడేపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వర్ణాభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గన్నావారిపల్లె రామాలయంలో హోమాలు



సోమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం గన్నావారిపల్లె రామాలయం వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు చేశారు. పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు. ఆలయ అర్చకుల హోమాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామస్తులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలించిన చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని కట్ట కింద సిద్ధేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆదివారం పరిశీలించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే కార్యక్రమాలు, ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. రొంపిచెర్ల పట్టణం నుంచి వచ్చే దారిలో అపరిశుభ్రత తొలగించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మల్లప్పకొండకు 15 అదనపు ఆర్టీసీ బస్సులు

కుప్పం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 26వ తేదీన కుప్పం ఆర్టీసీ డిపో నుంచి మల్లప్ప కొండకు 15 అదనపు బస్సు సర్వీసులు నడుపుతామని డిపో మేనేజరు ఎం.గోపినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలనుంచి ఈ బస్సులు నడుస్తాయన్నారు. నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

- పలమనేరు: శివరాత్రి పండుగ సందర్భంగా మొగిలిలో వెలసిన మొగిలీశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం పలమనేరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ పలమనేరు డిపో మేనేజర్ టీకే స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. పలమనేరు నుంచి మొగిలికి 5 బస్సులను నడుపుతున్నామని.. మనిషికి రూ.20 ఛార్జీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం నుంచి పలమనేరు మీదుగా మొగిలికి 11 బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. గుడియాత్తం నుంచి మొగిలికి బస్సు ఛార్జి రూ. 70గా నిర్ణయించామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
- సోమల: సోమల మండలం పెద్దఉప్పరపల్లె సమీపం దుర్గంకొండలో మహాశివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 26, 27వ తేదీల్లో పుంగనూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిననట్లు డిపో మేనేజర్ సుధాకరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సోమల నుంచి దుర్గంకొండ, పెద్దఉప్పరపల్లెలకు బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుప్పంలో గ్రీవెన్స్‌డే రద్దు

కుప్పం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు కడా కార్యాలయ అధికారులు తెలిపారు. ప్రజలు గుర్తించాలని కోరారు.

24, 25 తేదీల్లో కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

గుడుపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలంలో బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 24, 25 తేదీల్లో ఉదయం 10 గంటలకు మండల పరిషత్తు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాధాకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 24న గుడుపల్లె, సంగనపల్లె, కుప్పిగానిపల్లె, అగరం, యమగానిపల్లె, కనమనపల్లె, చీకటిపల్లె, సోడిగానిపల్లె, పొగురుపల్లె, కొడతనపల్లె, కంచిబందార్లపల్లె, ఒఎన్ కొత్తూరు 25న చిన్నగొల్లపల్లె, దాసిమానిపల్లె, గ్దుసాగరం, బెగ్గిలపల్లె, శెట్టిపల్లె, పెద్దబదనవాడ పంచాయతీల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు తమ వెంట ఆన్‌లైన్ అప్లికేషన్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫొటోలు రెండు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, జనన ధ్రువీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం, ఎలక్షన్ గుర్తుంపు కార్డు తమ వెంట తీసుకొని ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన కోరారు.

కందూరులో ఉచిత వైద్యసేవలు

సోమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరు రైతు సేవా కేంద్రం ఆవరణలో బెంగుళూరు వైదేహి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు షుగర్, గుండె జబ్బులు, కిడ్నీ, ఎముకలు, కంటి జబ్బులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు.

కరాటేలో బూరుగుమాకులపల్లె బాలుడి ప్రతిభ



రామకుప్పం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం ఆర్కాట్‌లో ఆదివారం నిర్వహించిన ఆలిండియా స్పోర్ట్స్ కరాటే టోర్నమెంటులో రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె పంచాయతీ బూరుగుమాకులపల్లెకు చెందిన రామచంద్రగౌడు కుమారుడు సిద్ధార్థ గౌడ విశేష ప్రతిభ కనబరిచాడు. దేశవ్యాప్తంగా వందలాది మంది కరాటే పోటీల్లో పాల్గొనగా పురుషుల విభాగంలో సిద్ధార్థగౌడ మొదటి స్థానంలో నిలిచాడని అతని తండ్రి తెలిపారు. కరాటే చీఫ్ మాస్టర్ రమేష్, చీఫ్ ఇన్‌స్ట్రక్టరు అరవిందకుమార్, చీఫ్ రెఫరీ మగేశ్వరన్‌లు సిద్ధార్థగౌడకు ట్రోఫీ, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. బాలుడిని గ్రామస్తులు అభినందించారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

రామకుప్పం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం వీర్నమల సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ వెంకటమోహన్ తెలిపారు. ఆదివారం ఉదయం పోలీసులు వీర్నమల సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వీర్నమలకు చెందిన సెల్వరాజు కాలినడకన అనుమానాస్పదంగా వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. అతని వద్ద ఉన్న 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు.

నంది వాహనంపై శివపార్వతుల దర్శనం

యాదమరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని త్రి వేణి సంగమంలో వెలసిన ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మ వారి ఆ లయంలో మ హా శివరాత్రి బ్రహ్మోత్సవాలు కన్నులపండుగగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో శివుడికి ప్రీతిపాత్రమైన నంది వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. రాత్రి నందివాహనంపై నుంచి దర్శనమిచ్చారు. భక్తులు మంగళహారతులు సమర్పించారు.

వంతెన నిర్మాణాలు కలేనా..!

- జీడిరేవులవంక, గార్గేయనదిపై కొట్టుకుపోయిన కల్వర్టులు
- ఇసుక బస్తాలు, సిమెంట్ పైపులతో తాత్కాలిక పనులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు







జీడిరేవుల వంక వద్ద తాత్కాలిక కల్వర్టు, పెద్దఉప్పరపల్లె వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు, గార్గేయనదిపై తాత్కాలిక కల్వర్టు

సోమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి)

మండలంలోని సోమల - నంజంపేట మార్గంలోని జీడిరేవుల వంకపై నిర్మించిన బ్రిడ్జి మూడేళ్ల క్రితం వచ్చిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో నెలరోజులు పాటు అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈక్రమంలోనే పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు, చిన్నఉప్పరపల్లె, నంజంపేట పంచాయతీలకు చెందిన ప్రజలు, అక్కడ పని చేసే ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు, ఆటోలు నెల రోజులు పాటు ఆగిపోయాయి. అప్పటికీ పాలకులు పట్టించుకోకుండా వదిలేశారు. ఈ మార్గంలో జీడిరేవుల వంక ఉధృతంగా ప్రవహించడంతో ఆ మార్గంలో ప్రయాణికులు, వాహనాలు వెళ్లకుండా పోలీసులు రాత్రీ పగలు నిఘా ఉంచారు. వంక ఉధృతి తగ్గిన అనంతరం ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఇలా ఉంటే బ్రిడ్జి సమీపంలో ఇసుక పూర్తిగా తోడేయడం జరుగుతోంది. గత ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణంపై పట్టించుకోలేదు. ఇప్పటికీ తాత్కాలిక వంతెన పైనే ప్రయాణాలు సాగుతున్నాయి.

కూటమి ప్రభుత్వమైనా పట్టించుకుని తమకు సురక్షిత ప్రయాణం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. పెద్దఉప్పరపల్లె - బోనమంద, పెద్దఉప్పరపల్లె - రెడ్డివారిపల్లె, పేటూరు మార్గంలోని గార్గేయనదిపై బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టకపోవడంతో వర్షాకాలం వస్తే ఈ మార్గంలో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. నవంబరులో కురిసిన వర్షాలకు పెద్దఉప్పరపల్లె ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని గార్గేయ నదిపై నిర్మించిన కల్వర్టు కొట్టుకుపోయింది. ఈక్రమంలో పేటూరు, బసవపల్లె, చినకమ్మపల్లె, బోనమంద, దుర్గంకొండ ఆలయానికి రాకపోకలు స్తంభించాయి. స్థానిక టీడీపీ నాయకులు స్పందించి తాత్కాలిక పనులు చేపట్టారు. మళ్లీ కురిసిన వర్షాలకు రెండు రోజులకే తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయింది. మళ్లీ అధికారులు స్పందించి ఇసుక బస్తాలు, సిమెంట్ పైపులు తాత్కాలికంగా ఏర్పాటు చేసి రాకపోకలకు అనువుగా చేశారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం గార్గేయనది, జీడిరేవుల వంకలపై శాశ్వత వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కేఈసీలోనే నాణ్యత ప్రమాణాలతో విద్యాబోధన



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీఎన్ తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నాణ్యత ప్రమాణాలతో కూడిన అత్యుత్తమ బోధనకు కుప్పం ఇంజనీరింగ్ కళాశాల చిరునామా అని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్ అన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాల 24వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీఎన్ మాట్లాడుతూ కేఈసీ బోధన, పరిశోధనలలో తన కంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కూడలిలో వెనుకబడిన ప్రాంతమైన మారుమూల కుప్పంలో 2001లో ప్రారంభించిన కుప్పం ఇంజనీరింగ్ కళాశాల అంచెలంచెలుగా ఎదిగి న్యాక్ ఏ గ్రేడ్‌తోపాటు అటానమస్ హోదాను సాధించిందని చెప్పారు. విద్యారంగంలో ఉన్నత స్థాయిలో ఉత్తమ విద్యా సంస్థగా గుర్తింపు పొందిన కేఈసీలోని వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. జబర్దస్త్ కమెడియన్స్ హైపర్ ఆది, ఆటో రాంప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని తమ కామెడీ డైలాగులతో ఆకట్టుకున్నారు. ప్రముఖులందరూ కలిసి కళాశాల సావనీర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కేడీసీ చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్, కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్ రాజ్, సీఈవో సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ సుధాకరబాబు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



కుప్పనపల్లెలో చెత్తసేకరణను పరిశీలిస్తున్న ఈవోఆర్డీ ప్రసాద్



ఆవులకుప్పంలో చెత్తసేకరణ కార్యక్రమంలో టీడీపీ నేతలు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా గుర్తించాలని ఈవోఆర్డీ ప్రసాద్ సూచించారు. ఇంటింటికీ చెత్త సేకరణ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం బైరెడ్డిపల్లె, పాతపేట, పాతూరునత్తం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న చెత్త సేకరణ, పారిశుధ్యపనులను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా వుండాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని, పారిశుధ్యం గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంసీవో సురేష్‌బాబు, గ్రామకార్యదర్శులు సదాశివయ్య, మోహన్ రాంప్రసాద్, నాగరాజు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

- రామకుప్పం: రామకుప్పం మండలంలో ఆదివారం అన్ని గ్రామాల్లో చెత్త సేకరణ కార్యక్రమాలు చేపట్టారు. కుప్పం డీఎల్‌పీఓ రాధాకృష్ణ పలు గ్రామాల్లో పర్యటించి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా ప్రతి శని, ఆదివారాల్లో అన్ని గ్రామాల్లో చెత్త సేకరణ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించిందన్నారు. పొడి, తడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్నారన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉబ్బదేవర ఉత్సవం



బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిపట్ల గ్రామంలో జరుగుతున్న వీరభద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రజకులు ఉబ్బదేవర ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వీరభద్ర రజక సహకారసంఘం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కస్తూర్బాలో ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

కుప్పం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరమసముద్రంలోని కస్తూర్బా (కేజీబీవీ) పాఠశాలలో స్కిల్ ఇన్‌స్ట్రక్టర్ కల్పన ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గుడుపల్లె మండలం గుండ్లసాగరం గ్రామానికి చెందిన కల్పన దాదాపు పదేళ్లగా ఈ పాఠశాలలో పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం ఆమె కుప్పంలోని ఆమె ఉంటున్న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆమెను స్థానికులు గమనించి కుప్పంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చేర్చారు. ప్రస్తుతం చికిత్స తీసుకుంటూ కోలుకుంటున్నారు. స్కూల్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి వేధింపుల కారణంగానే చనిపోవాలని నిర్ణయించుకున్నట్లు బాధితురాలు కల్పన ఆరోపించారు. అయితే ఎవరి విధులు వారు సక్రమంగా చేసుకోమని చెప్పడం తప్ప తాను కల్పనపై ఎటువంటి వేధింపులకు పాల్పడలేదని కేజీబీవీ ప్రిన్సిపల్ విజయలక్ష్మి ఆంధ్రజ్యోతికి వివరణ ఇచ్చారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య, ఎస్సై బాబు తెలిపారు.

ఇద్దరు నాటుసారా విక్రేతల అరెస్టు

చౌడేపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు. దుర్గసముద్రం పంచాయతీ చిన్ననాగన్నపల్లె వద్ద రాజన్న నాటుసారా విక్రయిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని 20 లీటర్ల సారాను, దిగువపల్లెకు చెందిన నక్కల అంజి వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు-మదనపల్లె మార్గంలో శనివారం రాత్రి పూజగానిపల్లె వద్ద ప్రైవేటు బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని పాల్యెంపల్లెకు చెందిన నరసింహులు, భార్య శోభారాణి ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వచ్చి తిరుగు ప్రయాణంలో పూజగానిపల్లె వద్ద వెళుతుండగా పుంగనూరు నుంచి మదనపల్లె వైపు వెళుతున్న ఓ ప్రైవేటు బస్సు ఢీకొంది. ప్రమాదంలో భార్యభర్తలు గాయపడ్డారు. 108 వాహనంలో వారిని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహాకుంభాభిషేకం



వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల-కల్లూరు మార్గంమధ్యలోని వగళ్లవారిపల్లి బస్టాపు వద్ద నూతనంగా నిర్మించిన యల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహా కుంభాషేకం వేడుకల్లో ఆదివారం మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్ కే రోజా, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, సునీల్‌కుమార్ పాల్గొన్నారు. వీరికి ఆలయ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి దంపతులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం సన్మానించారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు





చెంచమరెడ్డిగారిపల్లెలో వాడుకలో లేని విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనం

రొంపిచెర్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలో ఏడాది ముందు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిచే ప్రారంభించిన ప్రభుత్వ భవనాలు ఇంతవరకు వాడుకలోకి రాక నిరుపయోగంగా ఉన్నాయి. చెంచమరెడ్డిగారిపల్లె పంచాయతీలో గత ప్రభుత్వంలో లక్షల రూపాయల వ్యయంతో సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 2023 డిసెంబర్ 11వ తేదీన ప్రారంభించారు. అయితే సచివాయంలో ఫర్నీచర్, సిబ్బంది నియామకం జరగలేదు. కేవలం పంచాయతీ కార్యదర్శి మాత్రమే గదిలో ఉంటూ వెళుతున్నాడు. రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాల్లో విద్యుత్, ఫర్నీచర్, నీరు తదితర సౌకర్యాలు కల్పించకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో ఉన్న పంచాయతీ కార్యాలయ భవనంలో వైద్య సిబ్బంది మందులు, రికార్డులు ఉంచుకొని విధులు చేపడుతున్నారు. ప్రభుత్వ నిధుల వ్యయంతో నిర్మించి ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడకుండా నిరుపయోగంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): స్థానిక వీసీఆర్ బస్‌స్టాప్‌లో జిల్లా అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనకు నగరవాసుల నుంచి స్పందన లభించింది. పుస్తక ప్రదర్శనను ఉమ్మడి చిత్తూరు జిల్లా భాషోద్యమ సమితి సభ్యుడు సాకం నాగ రాజు ప్రారంబించారు. ప్రదర్శనలో ప్రముఖ రచయితలు రచించిన కవితా సంపుటాలు, ప్రముఖుల జీవిత చరిత్రలు, నవలలు, కథానిక సంపుటాలు, జనరల్ నాలెడ్జ్, పురణా ఇతిహాసల గ్రంథాలను సగం ధరకే విక్రయించారు.

వైభవంగా చిదంబరేశ్వరుడి రథోత్సవం



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో ఆదివారం వైభవంగా రథోత్సవ సేవ నిర్వహించారు. ఉదయం అతిరుద్ర యాగం నిర్వహించారు. అభిషేకాలు, పూజలు నిర్వహించి విశేష అలంకారాల్లో ప్రత్యేరథంపై అధిష్టింపజేసి ఊరేగించారు. రథోత్సవం సందర్భంగా ఉభయదారుల సహకారంతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. రథోత్సవసేవ ఉత్సవ ఉభయదారు వీకే విశ్వనాథ్‌కు ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో ఉత్సవ నిర్వాహకులు క్రిష్ణమూర్తి,అర్చకులు మహేష్, ఉమేష్, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరంలో కళ్లద్దాల పంపిణీ



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): స్థానిక రాములగుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద నేత్ర డాక్టర్ల సహకారంతో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 161 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. 68 మందికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షుడు సుభాష్ జైన్ తెలిపారు. ప్రేమ్‌చంద్, విశాల్,ఎవంత్, సాగర్, అమిత్, ప్రవీణ్, లలిత్ కమలేష్, జ్యోతి జైన్లు పాల్గొన్నారు.

ఆర్కాట్ టోర్నమెంట్‌లో నగరి విద్యార్థుల ప్రతిభ



విజేతలతో కరాటే మాస్టర్

నగరి, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో జరిగిన మాస్టర్ రాజ్‌కోటి ఆర్కాట్ టోర్నమెంటులో నగరి విద్యార్థులు ప్రతిభను చాటారు. షిటోరియా కరాటే పాఠశాలకు చెందిన 23 మంది విద్యార్థులు పాల్గొనగా 10 మంది ప్రథమ, ఆరుగురు ద్వితీయ, ఏడుగురు తృతీయ స్థానం సాధించారని పాఠశాల నిర్వాహకులు ప్రశాంత్ తెలిపారు.

ఆశా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి : ఏఐటీయూసీ



ప్రసంగిస్తున్న ఏఐటీయూసీ కార్యదర్శి కోదండయ్య

నగరి, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): ఆశా కార్మికుల జీతాలు పెంచి ఉద్యోభద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. కార్యకర్తల నియోజకవర్గ సమావేశం వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత అధ్యక్షతన జరిగింది. కోదండయ్య మాట్లాడుతూ నర్సింగ్‌కోర్సు చేసిన ఆశాలను ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలన్నారు. 18 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారన్నారు. చందామలై, సుజాత, షీబా, రూప, పుష్ప, గౌరి, పవిత్ర పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కులందేశ్వర ఆలయ మహా కుంభాభిషేకం



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): కట్టమంచి బాలకామాక్షి సమేత కులందేశ్వర ఆలయంలో ఆదివారం మహా కుంభాభిషేక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యే హోమాలు నిర్వహిచి కుంభాభిషేక కళశాలను కట్టమంచి వీధుల్లో ఊరేగించారు. వేదమంత్రోచ్చారణల నడుమ వాటిని విమాన గోపురాలపై ప్రతిష్టించి కుంభాభిషేకం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సతీమణి లావణ్యబాబు, జీజేఎం ట్రస్టు వ్యవస్థాపకుడు గురజాల చెన్నకేశవులునాయుడు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ ఉత్సవ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పల్లెల్లో నూర్పిడి యంత్రాలకు డిమాండ్



విజయపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత నెలలో కురిసిన వర్షాలకు పొలాల్లో తేమ ఎక్కువగా ఉండడంతో పనులకు కూలీలు పెద్దగా రావడం లేదు. పంట నేలకొరగడంతో ఎక్కువ మంది యంత్రాల నూర్పిడికి ఆసక్తి చూపుతున్నారు. సాధారణ నేలల్లో నూర్పిడి చేయడానికి గంటకు రూ.1700 నుంచి రూ. 2 వేల వరకు, పంట పొలాల్లో నీరు ఉన్నా, ఎక్కువగా తేమ ఉన్నా గంటలకు రూ. 2500 నుండి రూ. 3 వేల వరకు బాడుగ వసూలు చేస్తున్నారు. ఈ ఏడాది ఆశించిన దిగుబడి రాలేదని రైతులు వాపోతున్నారు. సాధారణంగా ఎకరాకు 30 నుండి 40 బస్తాల ధాన్యం పండుతుంది. నీ ప్రస్తుతం 15 నుంచి 25 బస్తాలకు మించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా సంత్ గాడ్గే బాబా జయంతి



సంత్ గాడ్గే బాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సంత్ గాడ్గే బాబా జయంతి కార్యక్రమాన్ని జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు రవి రాజు తదితరులు గాడ్గే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వెంకటేష్, ప్రతాప్, హరి, రుద్రయ్య, సాయిరామ్ ఆచ్చారి తదితరులు పాల్గొన్నారు.

ఇంధన సంరక్షణ, వినియోగంపై సైక్లోథాన్



సైక్లోథాన్‌లో పాల్గొన్న డీలర్లు, యువకులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇంధన సంరక్షణ, వినియోగంపై సైక్లోథాన్ నిర్వహించారు. ఆదివారం సంరక్షణ క్షమతా మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా హెచ్‌పీ పెట్రోల్ బంకు వేదం ఏజెన్సీ ఆధ్వర్యంలో స్థానిక కొంగారెడ్డిపల్లి నుంచి గాంధీ సర్కిల్ వరకు సైక్లోథాన్ నిర్వహించారు. హెచ్‌పీసీఎల్ చిత్తూరు సేల్స్ ఉదయ్ కార్తికేయన్ మాట్లాడుతూ ఇంధన సంరక్షణ, ఇంధన వినియోగాన్ని క్లీన్-గ్రీన్ ఎనర్జీగా మార్చు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో స్థానిక డీలర్లు, యువకులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

పాలసముద్రం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అయ్యవారికండ్రిగలో ఆదివారం జీవ అనే వ్యక్తి నాటు సారా విక్రయిస్తుండగా ఎస్ఐ చిన్నరెడ్డెప్ప సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

27న రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 23న చిత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో వివిధ బ్యాంకులు, కార్పొరేషన్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. చిత్తూరు ఎంపీడీవో శ్రీనివాసులు ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు.

పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న నలుగురిని రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సీఐ నెట్టికంఠయ్య వివరాల మేరకు.. సంతపేట పాంచాలిపురంలో కొంత మంది పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడికి చేరుకుని నలుగురిని పట్టుకుని రూ. 7100 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. తేనబండ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకుని రూ. 2400 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నంది వాహనంపై శివపార్వతుల దర్శనం



యాదమరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో వెలసిన ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మవారి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు కన్నులపండుగగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో శివుడికి ప్రీతిపాత్రమైన నంది వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. రాత్రి నందివాహనంపై నుంచి దర్శనమిచ్చారు. భక్తులు మంగళహారతులు సమర్పించారు.

విద్యార్థుల మృతికి కారకుడైన డ్రైవర్ అరెస్టు



డ్రైవర్‌ను అరెస్టు చూపుతున్న పోలీసులు

బంగారుపాళ్యం,ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మృతికి కారణమైన డ్రైవర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కత్తిశ్రీనివాసులు తెలిపారు. వివరాలు ఇలా.. ఈనెల 18వ తేదీ రాత్రి ఆర్ఆర్ నగర్ సమీపంలోని ట్రాక్టర్ షెడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గౌతమ్,ఉమాపతి అనే ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన విషయం విదితమే. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ కారు వదలి పరారయ్యాడు. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం వెలుతురుచేనుకు చెందిన డ్రైవర్ నరేంద్రను రాగిమానుపెంట క్రాస్ వద్ద అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

మొగిలికి ప్రత్యేక బస్సులు

పలమనేరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పండుగ సందర్భంగా మొగిలిలో వెలసిన మొగిలీశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం పలమనేరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ పలమనేరు డిపో మేనేజర్ టీకే స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. పలమనేరు నుంచి మొగిలికి 5 బస్సులను నడుపుతున్నామని.. మనిషికి రూ.20 ఛార్జీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం నుంచి పలమనేరు మీదుగా మొగిలికి 11 బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. గుడియాత్తం నుంచి మొగిలికి బస్సు ఛార్జి రూ. 70గా నిర్ణయించామన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మౌలిక వసతులు కొరవడి ఇబ్బందులు





యాదమరి ప్రధానవీధిలో మురుగు కాలువలు నిర్మించని వైనం- రోడ్డుపై నిలిచిన వర్షపునీరు (ఫైల్‌ఫొటో)- మూతబడ్డ మంచినీటి శుద్ధి కేంద్రం

యాదమరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): యాదమరి.. పేరుకే మండల కేంద్రం. మౌలిక వసతులు కరువయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం బస్ షెల్టర్ లేక ఎండనక, వాననక ప్రజలు అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న దుకాణాల సముదాయాల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. మహిళల పరిస్థితి మరీ దైన్యం. పబ్లిక్ మరుగుదొడ్లు లేకపోవడంతో అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తమే

డ్రైనేజీ వ్యవస్థ అంతా అస్తవ్యస్తమే. దాదాపు 40 ఏళ్ల కింట అప్పట్లో మురుగు కాలువను మసీదు వెనుక వీధిలో నుంచి నీవానదిలో కలిపారు. కాలక్రమేణా అది కొంత ఆక్రమణకు గురవగా.. మిగతాది కనుమరుగైంది. చినుకు పడిందంటే ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలుస్తోంది. మురుగుతో కలిసి దుర్గంధం వెదజల్లాల్సిందే. కాలనీలో కొంతమేరకే సీసీ రోడ్డు నిర్మాణం జరిగింది.

మూతపడిన మినరల్ వాటర్ శుద్ధి కేంద్రం

వైసీపీ హయాంలో మంచినీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసినా కొద్దిరోజులకే మూతపడింది. దీంతో ప్రైవేటు వ్యక్తుల వద్ద మంచి నీరు కొనుగోలు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యే మురళీమోహన్ స్పందించి మండల కేంద్రంలో సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామాల్లో చెత్త సేకరణపై విస్తృత అవగాహన



ఐరాలలో చెత్తను సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలను చెత్త రహితంగా తీర్చిదిద్దాలని ఈవోఆర్డీ కుసుమకుమారి అన్నారు. ఆదివారం ఆమె కాణిపాకం పంచాయతీలో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తడి,పొడి చెత్తను విడివిడిగా వేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తారన్నారు. చెత్త నుంచి పంచాయతీకి ఆదాయం సమకూరుతుందన్నారు. **పాలసముద్రం:** తడి,పొడి చెత్తను గ్రీన్ అంబాసిడర్లకు అప్పగించాలని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి కోరారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా బాలకృష్ణాపురం,వనదుర్గాపురం పంచాయతీలలో గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్తను సేకరించి బృందావనాలకు తరలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమేష్, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: గ్రామ పంచాయతీల్లో ఆదివారం చెత్తను సేకరించినట్లు ఈవోపీఆర్డీ పురుషోత్తం తెలిపారు. జక్కిదొన, గంటావారిపల్లి, నల్లవెంగనపల్లి, పాతగుంట, మాంబేడులో చెత్త సేకరణ కార్యక్రమాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. పాతగుంటలో సర్పంచ్ భువనేశ్వరి గ్రామపంచాయతీ ఉద్యోగులతో కలసి చెత్తను సేకరించారు. **వెనుమూరు:** 25 పంచాయతీల్లో సెక్రటరీలు, గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ఉదయం 6 గంటలకే గ్రామాల్లో చెత్త సేకరించడం మొదలు పెట్టారు. ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి పనులను పర్యవేక్షించారు. **శ్రీరంగరాజపురం:** పిళ్లారికుప్పం, శెట్టివానత్తం, మంగుంట గ్రామాల్లో చెత్త సేకరణపై ఈవోపీఆర్డీ కోదండరామిరెడ్డి అవగాహన కల్పించారు. ఆయన పారిశుధ్య కార్మికులతో కలిసి ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించారు. **బంగారుపాళ్యం:** చెత్త సేకరణకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి కవితా ప్రియదర్శిని గ్రామస్తులను కోరారు. గుండ్లకట్టమంచిలో చెత్తసేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. కళావతి మహేంద్ర,పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

ఆక్రమణయత్నానికి అడ్డుకట్ట



ఆక్రమణకు తరలించిన రాళ్లు,మట్టి

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కొండరాజపురానికి వెళ్లే రహదారి పక్కన ఒకరు మట్టి, రాళ్లు తోలి ఆక్రమించడానికి ప్రయత్నించాడని గ్రామానికి చెందిన కొంతమంది రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ లోకనాథం పిళ్లై స్పందించారు. ఆయన ఆదేశాలతో ఆర్ఐ ప్రభాకర్ సిబ్బందితో అక్కడికి వెళ్లి మట్టిని, రాళ్లను తొలగించారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

ఉచిత కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు వినతి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సప్తగిరి ప్రసాద్

తవణంపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు నియోజకవర్గం పరిధిలో పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ సెంటరు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబును టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ కోరారు. ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో ఆయన్ను కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. పేద, మధ్యతరగతి విద్యారుల్లో తెలివితేటలున్నా ఎక్కువ సొమ్ము వెచ్చించి కోచింగ్ సెంటర్లకు వెళ్లలేకపోతున్నారన్నారు. వీరి కోసం పూతలపట్టు, ఐరాల, తవణంపల్లె, యాదమరి మండలాల్లో ఉచిత కోచింగ్ సెంటరు ఏర్పాటు చేయాలని కోరారు.

రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు



పాలసముద్రం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పాలసముద్రం నుంచి కోదండరామాపురం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. మరోవైపు రోడ్డు అక్కడక్కడా గుంతలమయంగా మారింది. ప్రధానంగా మలుపుల వద్ద ముళ్ల కంపలు ఎక్కువగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా ముళ్ల కంపలను తొలగించి, గుంతలను పూడ్చాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టించుకునే వారేరి?



పునాది రాళ్ల లోడుతో వెళుతున్న ట్రాక్టరు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం- పచ్చికాపల్లం మార్గం.. అసలే సింగిల్ రోడ్డు. రోడ్డుకు ఇరువైపులా కోసుకుపోయి ఉండటంతో మామూలుగానే వాహనదారులు ఇబ్బంది పడుతుంటారు. అటువంటిది ఈ మార్గంలో తరచూ పునాది రాళ్లను సూచించిన లోడుకంటే అధికంగా వేసుకుని ట్రాక్టర్లు వెళుతున్నాయి. అవి ఎక్కడ తమపై పడతాయోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పైగా ఈ ట్రాక్టర్లకు నెంబర్లు కూడా కనిపించడం లేదని చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా సేవా కేంద్రం ప్రారంభం

పుంగనూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అందుబాటులో బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలు అందిస్తున్నట్లు విశ్రాంత డీఎస్పీ సుకుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎంబీటీ రోడ్డులో సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాదారులు సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో మైలారు పండుగ



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సీకే బాబు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): గిరింపేట గంగినేని చెరువు వీరభద్రస్వామి ఆలయంలో గిరింపేట ,మిట్టూరు, ప్రశాంత్ నగర్ రజక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మైలార్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. పూజల్లో చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు పాల్గొన్నారు. పూజానంతరం ఆయన భక్తులకు అన్నదానం చేశారు. అన్నపూర్ణ దుర్గ, కుట్టి, సురేష్, గోపాల్‌లతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి సత్కారం


విజయపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా తన ఎంపికకు కృషి చేసిన మాజీ మంత్రి ఆర్కే రోజాను గుణశేఖర్‌రెడ్డి ఆదివారం నగరిలో శాలువాతో సత్కరించారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపితానికి కృషి చేస్తామన్నారు. మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, వైస్‌ఎంపీపీ బాలాజీ, జిల్లుదాసు తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌ఐఏ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి నియామకం

నగరి,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్ట(ఆర్ఐఏ) సాధన కమిటీ జిల్లా కార్యదర్శిగా రామానుజం చలపతి ఎంపికయ్యారు. కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్.చంటి ముదిరాజ్ ఆదివారం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

కుప్పం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరమసముద్రంలోని కస్తూరిబా (కేజీబీవీ) పాఠశాలలో స్కిల్ ఇన్‌స్ట్రక్టర్ కల్పన ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గుడుపల్లె మండలం గుండ్లసాగరం గ్రామానికి చెందిన ఈమె దాదాపు 10 ఏళ్లుగా ఈ పాఠశాలలో పనిచేస్తున్నారు. ఆత్మహత్యకు ప్రయత్నించిన ఆమెను స్థానికులు గమనించి కుప్పంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చేర్చారు. ప్రస్తుతం కోలుకుంటున్నారు. ప్రిన్సిపల్ విజయలక్ష్మి వేధింపుల కారణంగానే చనిపోవాలని నిర్ణయించుకున్నట్లు బాధితురాలు కల్పన ఆరోపించారు. కాగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ శంకరయ్య తెలిపారు.



గంగాధరనెల్లూరు- తూగుండ్రం రహదారి సంభ్రం స్కూల్ కూడలిలో- మహదేవమంగళం చెరువుకట్టపై తారురోడ్డు - పుత్తూరురోడ్ నుంచి బొమ్మవారిపల్లెకు వెళ్లే రహదారి - తమిళనాడుసరిహద్దు దొడ్డిపల్లె ఆదిఆంధ్రవాడకు సమీపంలో రోడ్డు

గ్రామీణ రహదారుల దయనీయత

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కళత్తూరు, చిన్నవేపంజేరి, వేపంజేరి, వరత్తూరు, బాలగంగనపల్లె పంచాయతీల్లో చిత్తూరు - తచ్చూరు హైవేరోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి ఇసుక, మట్టి, ఇతర మెటీరియల్ తీసుకెళ్లే భారీ టిప్పర్ వాహనాలు సుమారు 50 నుంచి 80 టన్నుల బరువుతో రవాణా సాగిస్తున్నాయి. వీటి కారణంగా చాలా రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ రోడ్లపై ఇతరప్రాంతాలకు చెందిన వారు రాత్రిపూట వస్తే గుంతల్లోపడి గాయాలపాలవుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వాహనాలు గ్రామాల్లోకి వెళ్లాలన్నా తిప్పలు తప్పడంలేదు. సకాలంలో బాధితులను ఆస్పత్రులకు తరలించలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.